క్లుప్తంగా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ముడుమాలలో ఉపాధి కూలీల హాజరును తనిఖీ చేస్తున్న ఏపీఓ రామన్న

సి.బెళగల్: మండల ప్రజలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రామన్న సూచించారు. ఆయన మండలంలోని ముడుమాల, పోలకల్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరును మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. అదేవిధంగా పోలకల్ గ్రామంలో నిర్మిస్తున్న గోకులం షెడ్‌ను పరిశీలించారు. లబ్ధిదారులుతో మాట్లాడారు. పనులను త్వరగా పూర్తి చేసుకుంటే బిల్లులు వెంటనే మంజూరు అవుతాయని తెలిపారు. జాబ్‌కార్డుదారులకు అడిగిన వెంటనే పనులు కల్పించేదుకు సిద్ధంగా ఉన్నామని ఏపీఓ తెలిపారు.

మూల పెద్దమ్మ ఆలయంలో భక్తుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: గడివేముల మూలపెద్ద అమ్మవారి ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన,ఆకుపూజ వంటి విశేషపూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రం కర్నూలు సమిపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరెలు,గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

సస్యరక్షణతో చీడ పురుగుల నుంచి రక్షణ



మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: సాగులో సస్యరక్షణ పద్ధతులను పాటించి చీడపురుగుల నుంచి రక్షణ కల్పించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు కంబదహాల్ గ్రామంలో మంగళవారం ఏఓ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో రైతులతో ఏఓ సమావేశమయ్యారు. అదేవిధంగా పొలాలను పరిశీలించారు. సంరక్షణ, ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులపై ఏఓ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, వీపీఏ ఆసీఫ్, వీపీహెచ్ శశిదేవి తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు తీసుకోండి



క్షేత్రస్థాయి ప్రదర్శనలో ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: మొక్కజొన్న పంటను ఆశించిన కత్తెర పురుగు ఉధృతి నివారణకు చర్యలు చేపట్టాలని ఏఓ సుధాకర్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో మంగళవారం ఏఓ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జొన్న, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ రైతులకు వివరించారు. అలాగే రబీలో సాగు చేసిన అన్ని పంటలను ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ చార్జీల బాదుడుపై ...
వైఎస్సార్‌సీపీ పోరుబాట

- ప్రజల పక్షాన కూటమి సర్కార్‌పై పోరాటం
- 27న ట్రాన్స్‌కో కార్యాలయం వరకు భారీ ర్యాలీ
- పార్టీ శ్రేణులతోపాటు అభిమానులు, ప్రజలు తరలిరావాలి
- కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పిలుపు

కోడుమూరు రూరల్ : ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట చేపడుతుందని ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ కూటమి సర్కార్‌పై ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ఈ నెల 27వ తేదీన కోడుమూరులో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ట్రాన్స్ కార్యాలయం వరకు సాగే నిరసన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్లను గూడూరు, కర్నూలు జెడ్పీటీసీలు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి ప్రసన్నకుమార్, ఎంపీపీ సునీత, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డా.ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై భారం మోపేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలపై కరెంట్ చార్జీల పేరుతో బాదుడు కార్యక్రమానికి తెర లేపిందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇచ్చిన ఉచిత గ్యాస్ సిలిండర్లు కూడా సగంమందికి వర్తించడం లేదన్నారు. అధికారంలోకొచ్చిన 6నెలల్లోనే చంద్రబాబు మోసకారి నైజం పూర్తిగా ప్రజలకు అర్థమైందన్నారు. నాడు జగనన్న ఇచ్చిన హామీలకు కట్టుబడి ప్రతి హామీ లబ్ధిని ప్రజలకు సంపూర్ణంగా అందజేశారన్నారు. కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీల దగ్గర నుంచి అన్ని రకాల చార్జీలను పెంచుతోందన్నారు. సంపద సృష్టి అంటే ప్రజలపై భారం మోపడమేనా అని చంద్రబాబును ప్రశ్నించారు. చంద్రబాబు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, విద్యుత్ చార్జీల బాదుడును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీ, నిరసనలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రూ.15వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి హామీలను అమలు చేయకుండా ప్రజలపైనే రూ.15వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపడం దారుణమని జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి విమర్శించారు. బాబు చేస్తున్న దగాకోరు మోసాలపై ప్రజలంతా తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారన్నారు. గూడూరు ఎంపీపీ సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చంద్రబాబు ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక ప్రజలపైనే భారం మోపడమేమిటని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రశ్నించే సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని విమర్శించారు. ప్రజలు అన్నివిషయాలు గమనిస్తున్నారని, ప్రజా వ్యతిరేకత చవిచూడక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నెహ మియ్యా, ఉపసర్పంచ్ మాదులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ నాయుడు, నాయకులు రవి కుమార్‌రెడ్డి, వాసు, సంపత్‌కుమార్, మోహన్ బాబు, ధర్మారెడ్డి, లింగన్న, రాఘవేంద్ర, లింగమూర్తి, వెంకటేష్, ఏకాంబరం, లక్ష్మన్న, జగదీష్, విష్ణుదాస్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీలు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి ప్రసన్నకుమార్, ఎంపీపీ సునీత, నాయకులు

విద్యుత్ సరఫరా వేళల్లో స్వల్పమార్పు

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజులపల్లె ఏపీ ట్రాన్స్‌కో నుంచి గని సబ్ స్టేషన్‌లోకి వెళ్లే 220 కేవీ లైన్ కండక్టర్ మార్పిడి పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో స్వల్ప మార్పులు ఉంటాయని ఏఈ సునీల్ బాబు తెలిపారు. ఓర్వకల్లు సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ, కాల్వబుగ్గ వ్యవసాయ బోరు బావులు, పంచాయతీలకు సరఫరా చేసే త్రీఫేస్ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు జరుగుతాయన్నారు. సబ్ స్టేషన్ పరిధిలో శకునాల, బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె, గుమ్మితం తండాకు ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎటువంటి విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ మార్పులు డిశంబర్ 26 నుంచి జనవరి 1వ తేదీ వరకు ఉంటాయని, రైతులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కర్నూలు(రూరల్): గ్రామల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలంలోని పంచలింగాల గ్రామం ఎస్సీ కాలనీలో మంగళవారం ఎంపీ పర్యటించారు. రోడ్లు, మురిగు కాల్వలను పరిశీలించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరష్కార చర్యలు తీసుకుంటామని ఎంపీ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

పీజీఆర్ఎస్‌కు స్పందన కరువు

- ఆరురోజులకు వచ్చింది ఒక్క దరఖాస్తే

సి.బెళగల్: మండలంలో అధికారులు చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక శిబిర కార్యక్రమం (పీజీఆర్ఎస్)కు మండల ప్రజల నుంచి స్పందన కరువైంది. సుపరిపాలన వారోత్సవంలో భాగంగా ఈనెల 19వ తేది నుంచి 24వ తేది వరకు పీజీఆర్ఎస్ ప్రత్యేక శిబిరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు చేపట్టారు. అయితే మొదటి రోజు 19వ తేది బురాన్‌దొడ్డి రెవెన్యూ గ్రామానికి చెందిన ఒక్క రైతు మాత్రం ఉపాధి హామీ పథకంలో భాగంగా తన పొలంలో బావిని తవ్వాలని దరఖాస్తు అందజేశాడు. ఆరు రోజుల పాటు మరే ఇతర దరఖాస్తులు రాలేదు.



సి.బెళగల్ మండల పరిషత్‌లో పీజీఆర్ఎస్‌లో అర్జీలు లేక ఖాళీగా కూర్చున్న అధికారులు

చివరి రోజు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమాన్ని సూపర్‌డెంట్ శ్రీనివాసులు, సంగాల పంచాయతీ కార్యదర్శి ముస్తక్ నిర్వహించాగా ప్రజల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో అర్జీలు నిల్‌గా నమోదు అయ్యింది.

బాల యేసు చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు



మహిళలకు కట్టుమిషన్లను అందజేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రం గడివేములతోపాటు గ్రామాల్లో చర్చీలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో ప్రార్థనా మందిరాలను అలంకరించారు. మంచాలకట్ట గ్రామంలోని దివ్య బాల యేసు చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలకు బిషప్ మహాగణ గోరంట్ల జ్వానేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు, చిన్న పిల్లలకు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. మహిళలకు కుట్టు మిషను నేర్పించుటకు మూడ నెలల అవసరమై ఖర్చులను భరించి వారి కాళ్లమీద వారు నిలబడే విధంగా తోడ్పాటు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామం నాయకుడు వంగాల రమణారెడ్డి, ఫాదర్ తోట జోసెఫ్, ఫాదర్ లహస్రయ్, ఫాదర్ జోజిరెడ్డి, ఫాదర్ ప్రవీను, సిస్టర్, టీచర్ నాగన్న, సంగస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆట వస్తువుల విరాళం

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆటవస్తులను దాతలు విరాళంగా అందజేశారు. హెచ్‌ఎం రామచంద్రారెడ్డి విజ్ఞప్తి మేరకు మంగళవారం ఎమ్మెల్సీ, రిటైర్డ్ ఐజీ మహమ్మద్ ఇక్బాల్, పాఠశాల పూర్వ విద్యార్థులైన గుట్టపాడు మోహన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేంద్రారెడ్డి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని విరాళంగా ఇస్తామని వారు ప్రకటించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అదనపు ట్యాంక్ ఏర్పాటుకు రూ.20 వేలు అందజేశారు. అలాగే కబడ్డీ, ఖోఖో కోర్టులను ఎర్రమట్టితో చదును చేస్తామన్నారు. విద్యార్థుల తాగునీటి సమస్య పరిష్కారానికి తమవంతు సాయంగా రూ.10 వేలు అందజేశారు. దాతలను పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డి పూలమాలతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, భాస్కర్, రామాంజనేయులు, చంద్రశేఖర్ రాజు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దాతలను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు

వివాదాస్పద అటవీ భూముల పరిశీలన



భూములకు హద్దులు ఏర్పాటు చేయించిన జేసీ నవ్య

ఓర్వకల్లు: అటవీ, రెవెన్యూ శాఖ భూముల మధ్య వివాదాస్పదమైన భూములను ఆయా శాఖల ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన విచారణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య, సర్వే ఏడీ మునికన్నన్, ఆర్‌డీఓ సందీప్ కుమార్, ఎఫ్‌ఆర్‌ఓ వెంకటరమణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ విజయకుమారి సమక్షంలో వివాదాస్పద భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా అటవీ శాఖ రికార్డులను పరిశీలించగా 1885 సంవత్సరం ప్రకారం శకునాల, బ్రాహ్మణపల్లె, కాల్వ పరిధిలో సుమారు 350 ఎకరాలు అటవీ శాఖ భూములని, ఆ మేరకు సంబంధిత అధికారులు అభ్యంతరం చేశారు. అయితే బ్రిటీష్ కాలంలో 1908లో జరిగిన రీ సర్వే ఆధారంగా రెవెన్యూ భూమిగా పరిగణించినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులను ఆధారం చేసుకొని 55 ఎకరాలను గ్రీన్‌కో సంస్థకు కేటాయించడం జరిగింది. దీంతో అటవీ శాఖ అధికారులు అభ్యంతరం చేయడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టినట్లు జేసీ నవ్య తెలిపారు. అటవీ శాఖ వద్ద సరైన రికార్డులు లేనందు వల్ల సదరు భూముల్లో రెవెన్యూ భూములని హద్దులు ఏర్పాటు చేయాలి ఆదేశించారు. విచారించి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆమె వెంట ట్రైనీ కలెక్టర్ కళ్యాణి, మండల సర్వేయర్ శంకర్ మాణిక్యం, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన

కల్లూరు: ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీ విపత్తు సంభవించినప్పుడు ఏర్పడే విత్కర పరిస్థితులలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ కర్నూలు కేంద్ర అధికారి చిన్న బజారప్ప, ఇతర శాఖల అధికారులు మంగళవారం ఉదయం కర్నూలు శివారులోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఎల్‌పీజీ ప్లాంట్‌లో గ్యాస్ లీక్ మాక్ డ్రిల్ నిర్వహించారు. సాయంత్రం గొందిపర్ల గ్రామంలోని టీజీవీ ఎస్ఆర్‌ఏఏసీ లిమిటెడ్ ఫ్యాక్టరీలో క్లోరిన్ గ్యాస్ లీక్ మాక్ డ్రీల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాకశాఖ కర్నూలు కేంద్ర అధికారి చిన్న బజారప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విపత్కర పరిస్థితులపై అవగాహన కలిగి ఉండడం అవసమన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నేడు క్రిస్మస్

- ముస్తాబైన చర్చీలు
- విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్న ప్రార్థనా మందిరాలు
- అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన ప్రార్థనలు

పాణ్యం/ఓర్వకల్లు/ గడివేముల: క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబయ్యాయి. బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రార్థనా మందిరాలలో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చర్చిలను సుందరంగా అలంకరించారు. క్రైస్తవులు తమ ఇళ్లపై స్టార్స్ ఏర్పాటు చేసుకున్నారు. ఆర్‌సీఎం, సీఎస్ఐ, ఏబీఎం తదితర చర్చీలలో మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. రెవరెండ్ ఫాదర్ ఆనందరాజుతో పాటు, ప్రధాన యాజకుడు, ప్రసంగీకుడు ఫాదర్ సుధాకర్, సహాయకులు డీకాన్ ప్రతాప్ బైబిల్ సందేశం వినిపించారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లోని చర్చీలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. ప్రార్థనా మందిరాలను రంగుల విద్యుత్ బల్బులతో అలంకరించారు. ఏసుక్రీస్తు పుట్టిన రోజును పురస్కరించుకుని చర్చీలలో క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశారు. బాలఏసు, మరియమ్మ ప్రతిమలను ప్రతిష్టించారు. మండళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.



ఓర్వకల్లు : వేడుకలకు ముస్తాబైన ఆర్‌సీఎం ప్రార్థనా మందిరం



గడివేముల: క్రిస్మస్‌కు ముస్తాబైన సీఎస్ఐ చర్చి



పాణ్యం: విద్యుత్ కాంతులతో వెలుగుతున్న కొండజుటూరు సీఎస్ఐ చర్చి



సి.బెళగల్: రంగుల విద్యుత్ బల్బుల వెలుగులో సి.బెళగల్ ఏబీఎం చర్చి



సి.బెళగల్: విద్యుత్ బల్బుల వెలుతురులో చర్చి

డీలర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రూరల్): కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఖాళీ, నూతంగా ఏర్పడిన 74 చౌక దుకాణాల డీలర్ల నియామకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డీఓ కె.సందీప్ కుమార్ మంళవారం ప్రకటన విడుదల చేశారు. సి.బెళగల్ మండలంలో 6 ఖాళీలు, గూడూరు-3, కోడుమూరు-11, కల్లూరు-3, కర్నూలు రూరల్-2, కర్నూలు అర్బన్-10, ఓర్వకల్-2, వెల్దుర్తి-8 ఉన్నట్లు వివరించారు. కొత్తగా ఏర్పడిన దుకాణాలు గూడూరు-1, కల్లూరు-3, కోడుమూరు-1, కర్నూలు రూరల్-3, కర్నూలు అర్బన్-21 డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. డీలర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఇంటర్ విద్యార్హత కలిగి 18నుంచి 40 సంవత్సరాలు వయసు కల్గినవారు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ఆర్‌డీఓ కార్యాలయానికి చేరేలా రిజిస్టర్ పోస్టులేదా నేరుగా అందజేయాలని సూచించారు. 80 మార్కులకు సివిల్‌సప్లై నిర్వహించే అర్హత పరీక్షలో వచ్చిన మార్కులు, 20 మౌఖిక పరీక్షలో వచ్చిన మార్కులు మెరిట్ లిస్టును తయారు చేసి డీలర్లను ఎంపిక చేస్తామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరామ్ ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పోలీసులు మంగళవారం తెలిపారు. కడప జిల్లాకు చెందిన ముసంబీర్, ఫక్రుద్దీన్ ఏపీ 04బీఎఫ్1528 నంబర్ బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ప్రమాద శాత్తు కిందపడడంతో గాయాలయ్యాయని చెప్పారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు.

- పాణ్యంలోని చెరువు కట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మినరల్‌వాటర్ ట్యాంక్ ఆటో, బైక్ ఢీకొనడంతో పాణ్యం గ్రామానికి చెందిన అక్బర్ ఉసేన్ గాయపడిటన్లు 108 సిబ్బంది తెలిపారు.

గడ్డం రామకృష్ణ ఎంపిక అభినందనీయం

గడివేముల: వైఎస్సార్‌సీపీ మాదాసి కురువ, మాదారి కురువ విభాగానికి రాష్ట్ర అధ్యక్షునిగా గడ్డం రామకృష్ణ ఎంపిక అభినందనీయమని జిల్లా కురువ సంఘం కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు కొనియాడారు. ఈ మేరకు మంగళవారం గడ్డం రామకృష్ణను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి సన్మానించారు. అనంతరం గడ్డం రామకృష్ణ మాట్లాడుతూ 60 ,70 ఏళ్లుగా ఏ రాజకీయ పార్టీ కూడా మాదాసి కురువ, మాదారి కురువలను పట్టించుకోలేదన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ గుర్తించిందని సంతోషం వ్యక్తం చేశారు. మాదాసి కురువ, మాదారి కురువల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.



రామకృష్ణను సన్మానిస్తున్న కురువ సంఘం కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు

పిల్లలు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు, చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమెల్యే ఐజయ్య

కర్నూలు(రూరల్): కర్నూలు మండలం నందనపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అభయ గిరిక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే ఐజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వంద మంది వృద్ధులు, పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఐజయ్య మాట్లడుతూ యేసు కృపతో ప్రజలందరు సుఖశాంతులతో జీవించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎక్కలదేవి రాజశేఖర్, చెరుకు రత్నం, వేల్పుల శ్రీనివాసులు, పిడతల శేషన్న, దామోదరం, జాషువా, కరుణాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(రూరల్): భూ సమస్యల పరిష్కార మే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవా లని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని ఆర్. కొంతలపాడు గ్రామలో మంగళవారం ఆమె రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై రైతుల నుంచి 31 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ తెలిపారు. ప్రతి విన తికి త్వరలో పరిష్కారం చూపుతామని చెప్పా రు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో చంద్రశేకర్ రేడ్డి, వీఆర్‌వో వెంకటేశ్వర్లు, సర్వేయర్లు, వీఆర్ఎలు తదియుతరులు పాల్గొన్నారు.

కొండజుటూరులో రెవెన్యూ సదస్సు

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో మంగళవారం తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలు పరిష్కరించాలని 36 వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామ్, సిబ్బంది పాల్గొన్నారు.